సాక్షి అనకాపల్లి

బుధవారం । 2 । అక్టోబర్ । 2024



అప్పన్నకు గరుడసేవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి గరుడసేవ ఆలయ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు.



తల్లిదండ్రుల ఆందోళన 8లో

సెలవులని సమాచారమిచ్చి, విద్యార్థులను పంపకపోవడంపై తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల నాలుగు రోజుల ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం చెప్పారు. ఈనెల 2న 8 మి.మీ, 3న 8, 4న 6, 5న 6, 6న 5 మి.మీ చొప్పున వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

'చిక్కీ'ల తనిఖీ



మునగపాక హైస్కూల్‌లో సామాగ్రి స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో శివనాయుడు

మునగపాక : మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు అందజేస్తున్న చిక్కీలు కాలం చెల్లినవి కావడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో చిక్కీలు కాలం చెల్లినవిగా తెలియడంతో పలు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ మేరకు సాక్షి దినపత్రికలో మంగళవారం వచ్చిన 'నాణ్యత చిక్కింది' వార్తకు అధికారులు స్పందించారు. ఎంఈవో శివనాయుడు మంగళవారం సంబంధిత హైస్కూల్‌కు చేరుకొని మెటీరియల్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. కాలం చెల్లిన ప్యాకెట్ ఒకటి ఉన్నట్టు గుర్తించారు. ప్రతి 15 రోజుల కొకసారి స్టాక్ వస్తుంటుందని, వాటిని పరిశీలించి తీసుకోవడం జరుగుతుందని ఇకపై ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని ఎంఈవో శివనాయుడు ఆదేశించారు. స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సీఆర్పీలు అచ్యుతకృష్ణ, ఎం.గోవింద, ఆర్.సత్తిబాబు, కె.లక్ష్మీనారాయణ, నూకేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా చట్టాలు

- ప్రేమ సమాజాన్ని సందర్శించిన న్యాయమూర్తి విజయ



వృద్ధులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

యలమంచిలి రూరల్: మనిషి జీవన చక్రంలో బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం సహజమేనని, వృద్ధాప్యంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి రక్షణకు చట్టాలున్నాయని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ తెలిపారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో మంగళవారం ఆమె మాట్లాడారు. సమస్యలేమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. పుట్టిన ప్రతి వ్యక్తి తుది శ్వాస ఉన్నంత వరకు వృద్ధాప్యంలోనూ ఆనందంగా జీవించాలనుకుంటారన్నారు. ఇందు కోసం ప్రభుత్వాలు చట్టాలతోపాటు సదుపాయాలను కల్పిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏజీపీ డి. వెంకట్రావు, యలమంచిలి బార్ అసోసియేషన్ కార్యదర్శి బి. హరి శంకరరావు, ఉపాధ్యక్షుడు పి.వి. రమణ, ప్యానల్ న్యాయవాది టి. నూకరాజు, ప్రేమ సమాజం కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలు దసరా సెలవులు కచ్చితంగా పాటించాల్సిందే

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రకటన

తుమ్మపాల: ఈ నెల 3 నుంచి 13 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దసరా సెలవులను జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు కచ్చితంగా పాటించాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు, రక్త సంబంధీకుల మధ్య పండగ జరుపుకునేందుకు కొన్ని నెలల ముందుగానే ప్రణాళికలు రూపొందించుకుని ఆనందోత్సాహాల మధ్య జిల్లాలు, రాష్ట్రాలు దాటి ప్రయాణాలు చేస్తుంటారని, వీటిని నిలువరించే ప్రయత్నాలు చేయొద్దని సూచించారు. వీటిపై ఇప్పటికే తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. సెలవులు శతశాతం అమలు చేయాలని తమ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు అన్ని జిల్లాల ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. దసరా సంబరాల పేరుతో పరోక్షంగా తరగతుల నిర్వహణ, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ప్రయత్నిస్తే బాలల హక్కుల ఉల్లంఘనగా భావించి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చర్య తీసుకుంటుందన్నారు. ఇటువంటి పాఠశాలల వివరాలు apscpcr2018@gmail.com చిరునామాకు మెయిల్ చేస్తే యుద్ధప్రాతిపదికన తాము స్పందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

టెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- అభ్యర్థుల సందేహాల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు

8లో

భలే తాత మన బాపూజీ...

బాలల తాత బాపూజీ

బోసినవ్వుల బాపూజీ..
చిన్ని పిలక బాపూజీ

కులమత భేదం వలదన్నాడు..
కలిసి బతికితే బలమన్నాడు...

మానవులంతా ఒకటన్నాడు...
మనలో జీవం పోశాడు...

అంటూ... బాలల మనసులో మహాత్ముడు నిలిచిపోయాడు..

నిరాడంబరత, సాధు వర్తనంతో సత్యము, అహింసలే శాంతిమార్గమని జగానికి ఉపదేశించిన గాంధీజీ బాలల మదిలో బాపూజీ...

నాటి తరానికి సత్యాగ్రహం ఆయుధమైతే...
నేటి తరానికి గాంధీయిజం...ఒక ఆదర్శం..

మహాత్ముడు బోధించిన ఆ ఆదర్శం అజరామరం...అంటూ గాంధీజీని మననం చేసుకున్నారు ఈ బాల గాంధీలు...



ఉప్పు సత్యాగ్రహ వేళ గాంధీజీతో నెహ్రూ ముచ్చట్లు.. కందిపూడి విద్యార్థుల ప్రదర్శన



బుచ్చెయ్యపేట మండలం కందిపూడి పాఠశాలలో బాల గాంధీలు



గాంధీ వేషం ధరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

బుచ్చెయ్యపేట : అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా కందిపూడి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఇలా గాంధీ వేషధారణలో పూజ్య బాపూజీని ఆవాహన చేసుకున్నారు. మహాత్ముని సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రదర్శన ఇచ్చారు. తెల్లదొరలకు వణుకు పుట్టించిన ఉప్పు సత్యాగ్రహాన్ని స్ఫురణకు తెచ్చారు. రాట్నం తిప్పుతూ విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపునిస్తూ స్వదేశీ నినాదాన్ని వినిపించారు. గాంధీజీ అడుగుజాడల్లో నడిచి దేశ స్వాతంత్య్రం కోసం నెహ్రూ.. పటేల్...అహింసా మార్గంలో సాధించిన విజయాలను గుర్తు చేశారు..

ఈ బాలగాంధీలు.. బ్రిటిష్ వారిని ఎదురిస్తే భారతీయులను నిర్దాక్షిణ్యంగా కాల్చివేస్తున్న కాలంలో గాంధీ చేపట్టిన అహింసా, శాంతి, నిరసనల ద్వారా దేశం నుంచి బ్రిటిష్ వారిని వెళ్లగొట్టిన సన్నివేశాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.

ఇలా వినూత్నంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో బాలలతో గాంధీజీకి నివాళులర్పించిన ప్రధానోపాధ్యాయుడు బి అప్పలమూర్తి, ఉపాధ్యాయులు లావణ్య, త్రిమూర్తులు, ప్రశాంత్, రమణలను ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిఎస్. దుర్గాప్రసాద్, కార్యదర్శి దేముడుబాబు, మండల ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శేషుకుమార్, మధుక్రిష్ణ అభినందించారు.

● మన్నించు మహాత్మా!..

ఇక మద్యం వరదే..

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 331 షాపుల ఏర్పాటు
- విశాఖలో 155, అనకాపల్లిలో 136, అల్లూరిలో 40 షాపుల కేటాయింపు
- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ, 11న లాటరీ విధానంలో షాపుల కేటాయింపు
- రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు



విశాఖ సిటీ : ఉమ్మడి విశాఖలో మద్యం ఏరులై పారనుంది. నగరంలోనే కాకుండా గ్రామాల్లో సైతం లిక్కర్ వరద ముంచెత్తనుంది. మరికొద్ది రోజుల్లో మద్యం వ్యాపారం మళ్లీ ప్రైవేటు మాఫియా కబంధ హస్తాల్లోకి వెళ్లిపోనుంది. 2019కు ముందు విధానాన్నే మళ్లీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కొత్త మద్యం పాలసీ ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి.. లాటరీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీంతో గత అయిదేళ్లు లిక్కర్ వ్యాపారానికి దూరంగా ఉన్న సిండికేట్లు మళ్లీ జవసత్వాలు నింపుకొని బరిలోకి దిగారు. ప్రస్తుతమున్న ప్రభుత్వ మద్యం దుకాణాల కంటే వాటి సంఖ్య పెరగనుండడంతో మద్యం విచ్చలవిడిగా లభ్యమవుతుంది. వీటితో పాటు ఇప్పుడు మళ్లీ బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

331 లిక్కర్ షాపులకు నోటిఫికేషన్

నూతన మద్యం పాలసీ ప్రకారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం ఉమ్మడి విశాఖలో 331 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చారు. విశాఖ జిల్లాలో 155 షాపులు కేటాయించగా.. జీవీఎంసీ పరిధిలో 136 షాపులు రానున్నాయి. అలాగే అనకాపల్లి జిల్లాలో 136 షాపులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40 షాపులు ఏర్పాటుకానున్నాయి. ఒక్కో షాపు కోసం దరఖాస్తుదారులు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. విశాఖ జిల్లాలో ఈనెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 11న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమక్షంలో లాటరీ నిర్వహిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి వెల్లడించారు. అదే రోజు అనకాపల్లిలో ఓల్డ్ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఉప్పాడ చంద్రశేఖర్ కల్యాణ మండపంలోను, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు మండలంలో ఎస్పీ ఆఫీస్ సమీపంలో ఉన్న వియా ఫంక్షన్ హాల్‌లో లాటరీ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

షాపుల కోసం తీవ్ర పోటీ

2019 ముందు వరకు లిక్కర్ వ్యాపారాన్నే నమ్ముకున్న ఉన్న వారికి ప్రాణం లేచివచ్చినట్టయింది. అయిదేళ్లు వ్యాపారానికి దూరమైన సిండికేట్లు ఇప్పుడు మద్యం షాపులను చేజిక్కించుకోవడానికి ఇప్పటికే తెరవెనుక ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈసారి మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు సైతం భావిస్తున్నారు. ఎంత ఎక్కువ మంది పోటీ పడి దరఖాస్తులు చేస్తే.. అంతటి స్థాయిలో నాన్‌రిఫండబుల్ ఫీజు రూ.2 లక్షల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.

అప్పుడే బెల్టు భయం

గత టీడీపీ హయాంలో బెల్టు షాపులు కోకొల్లలుగా ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించారు. తాజాగా పాత విధానం అమల్లోకి వస్తుండడంతో మళ్లీ బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అప్పట్లో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి టీడీపీ ప్రభుత్వం షాపులకు లక్ష్యాలను నిర్దేశించింది. ప్రతి నెలా గరిష్టంగా మద్యం సరుకును కొనుగోలు చేయాలని ఎక్సైజ్ అధికారుల ద్వారా ఒత్తిడి చేసేది. ఈ క్రమంలో మద్యం షాపుల నిర్వాహకులకు మూడు నుంచి అయిదు బెల్టు షాపుల నిర్వహణకు అనధికారికంగా అనుమతులిచ్చేవారు. దీంతో విచ్చలవిడిగా, బహిరంగంగా మద్యం విక్రయించినా అధికారులు పట్టించుకున్న సందర్భాలు ఉండేవి కాదు. ఈ బెల్టు షాపుల బరితెగింపుపై అప్పట్లో మహిళా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపేవి. ప్రస్తుతం అదే స్థాయిలో మళ్లీ బెల్టు షాపులు పుట్టుకొచ్చే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే మహిళా సంఘాలు ఆందోళన బాట పట్టాయి.

మద్యం దుకాణాలు బంద్

- కొత్త ఎక్సైజ్ పాలసీతో పొట్ట కొట్టవద్దని ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేడుకోలు
- గత పది రోజులుగా వినతి పత్రాలు అందించినా ఫలితం శూన్యం

జిల్లాలో మద్యం దుకాణాలు 147

వాటిలో పనిచేసే సిబ్బంది సంఖ్య 700



చోడవరంలో మద్యం దుకాణాలను మూసివేసి సేవ్ మై జాబ్స్ అని నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు


సాక్షి, అనకాపల్లి: ఏపీలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఎక్సైజ్ పాలసీతో తమకు అన్యాయం జరుగుతుందనే ఆందోళనతో మద్యం షాపుల్లో పనిచేసే ఏపీ బేవరేజెస్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం విధులకు హాజరుకాకుండా దుకాణాలు బంద్ చేశారు. ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాన్ని కలిసి తమ సమస్యలు చెప్పుకున్నా ఫలితం లేకపోవడంతో ఇలా షాపులు మూసేసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ విజయ క్రిష్ణన్‌కు కూడా అసోసియేషన్ తరఫున వినతి పత్రం అందజేశారు. గత 10 రోజులుగా బేవరేజెస్ ఉద్యోగులు ప్రభుత్వానికి వినతులు అందించినా ఫలితం లేకపోవడంతో జిల్లాలో ఉన్న మొత్తం 147 దుకాణాలను మంగళవారం బంద్ చేశారు. ఈ ఆందోళనలో ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ సేల్స్‌మెన్, సూపర్‌వైజర్ల అసోసియేషన్ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొంటున్నారు. ఉద్యోగుల సమస్యపై ప్రభుత్వం త్వరలో ఓ పరిష్కారం చూపకపోతే మద్యం దుకాణాలను మూసే ఉంచుతామని.. అవసరమైతే ఆందోళన చేయడానికి కూడా వెనకాడేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కరోనా లాంటి విపత్కర సమయాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచేలా ప్రాణాలను పణంగా పెట్టి మద్యం షాపుల్లో పనిచేశామని, అలాంటి తమపై ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో రోడ్డున పడేలా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు.

సేవ్ అవర్ జాబ్స్



ప్రభుత్వం ఈనెల 7వ తేదీలోగా స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తాం. ఎన్నికలకు ముందు మాకు హామీ ఇచ్చిన ప్రజా ప్రతినిధులకు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశాం. కొత్త మద్యం విధానాన్ని 2వ తేదీ నుంచే ప్రభుత్వం అమలు చేయనుంది. దయచేసి మా కన్నీళ్లు చూసి మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. లేదంటే జిల్లాలో 700 కుటుంబాలు రోడ్డు పడతాయి. **-అచ్చియ్యనాయుడు**, సూపర్‌వైజర్, జిల్లా బేవరేజెస్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్

ఉద్యోగ భద్రత కల్పించాలి



కరోనా లాంటి సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచాం. ఇప్పుడు మమ్మల్ని తీసేస్తున్నారు. మాకు ఉద్యోగ భద్రత కల్పించకుండా విధులు నిర్వహించమంటున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిన్నటితోనే గడువు పూర్తయింది. మా ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. మా కుటుంబాలనే రోడ్డున పడేస్తారా?

-దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్, చోడవరం సర్కిల్

స్పందించకుంటే నిరసన ఉధృతం



పది రోజుల నుంచి ప్రభుత్వానికి మా గోడు చెబుతున్నా స్పందించడం లేదు. నిన్న కలెక్టర్‌కు కూడా స్పందన ద్వారా వినతి ఇచ్చాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే నిరసన ఉధృతం చేస్తాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో మా ద్వారా వచ్చిన ఆదాయం ఎంత..? వాడుకుని వదిలేస్తారా..? మా కుటుంబాలు రోడ్డున పడతాయి. ఆలోచించండి.

- ఎం.రమేష్, సేల్స్‌మన్, మేడివాడ

నోటిఫికేషన్ విడుదల



మద్యం దుకాణాల నోటిఫికేషన్‌పై జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ క్రిష్ణన్

- జిల్లాలో 136 దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ
- పారదర్శకంగా, కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ ఆదేశాలు

తుమ్మపాల : మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కట్టుదిట్టంగా, భద్రతా చర్యలు పాటిస్తూ, పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వక అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మద్యం దుకాణాల పాలసీపై మంగళవారం సంబంధిత ఎక్సైజ్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించడానికి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చినట్టు చెప్పారు. జిల్లాలో 136 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించబోతున్నామన్నారు. పూర్తి వివరాలు గెజిట్‌లో పొందుపరచడం జరిగిందని, దరఖాస్తు చేయు వ్యక్తులు సదరు మద్యం దుకాణాలకు సంబంధించిన ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ, లాటరీ విధానాన్ని కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ ఆఫీసర్ సుధీర్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

'ఉక్కు' సంకల్పంతో కదలిరండి



అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద దీక్షా శిబిరం

అనకాపల్లి: ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతిరూపమైన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్ర ప్రజలంతా కదలిరావాలని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మంగళవారం ఒక రోజు దీక్షా శిబిరాన్ని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగంతో, 67మంది ఎమ్మెల్యేల రాజీనామాతో స్టీల్‌ప్లాంట్‌ను సాధించామన్నారు. 64 గ్రామాల్లో 16,500 మంది నిర్వాసితులు 22 వేల ఎకరాల భూములు ఇచ్చారన్నారు. 2014లో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించి, ఆదానికో అంబానికో అప్పచెప్పాలనే కుట్రతో ఉన్నారు. ప్లాంట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.4,890 కోట్లు ఇస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.44 వేల కోట్లు స్టీల్‌ప్లాంట్ పన్ను రూపంలో చెల్లించిందన్నారు. కేంద్రం రూ.500 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పుకుందని, అందులో రూ.235 కోట్లు జీఎస్టీకి మిగిలిన రూ.265 కోట్లు బ్యాంకు లోన్లకు జమ కట్టుకున్నారని ఆయన చెప్పారు. సెయిల్లో విలీనం చేయడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు.

ముడి ఖనిజం తెప్పించి స్టీల్‌ప్లాంట్‌ను నడిపించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని, కానీ ఉత్పత్తిని తగ్గించే లక్ష్యంతో రెండు బ్లాస్ట్ ఫర్నేసులు మూసివేసినట్టు ఆయన చెప్పారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దీక్షా శిబిరాన్ని సందర్శించి.. స్టీల్ ప్లాంట్ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుని వెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర, పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజు పాల్గొన్నారు.

ఇదెక్కడి అన్యాయం అధ్యక్షా..

- స్పీకర్ ఇలాకాలో... తెరచుకోని ఇసుక డిపో
- అవస్థలు పడుతున్న నిర్మాణదారులు
- ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులు
- ముగిసిన విచారణ.. మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు
- ఇసుక రేట్‌ను అమాంతంగా పెంచిన అక్రమార్కులు



గబ్బాడ డిపోలో ఇసుక నిల్వలు

నర్సీపట్నం: ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన ఉచిత ఇసుక విధానం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిథ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గంలో అమలు కావటం లేదు. సెప్టెంబర్ 20 నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. జూలైలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం మండలంలోని గబ్బాడ ఇసుక డిపోను సందర్శించారు. డిపోలో ఉన్న 63 వేల టన్నుల ఇసుకను నిల్వ చేసిన వారెవరో తేల్చిన తరువాతే డిపో నుంచి ఇసుక సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్, మైనింగ్ అధికారులను ఆదేశించారు. గబ్బాడ డిపోలో 48,204 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. విచారణ పేరుతో నాలుగు నెలలుగా ఇసుకను సరఫరా చేయలేదు. ఈ విషయమై గత నెల 30న కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎంక్వయిరీ పేరుతో ఉన్న ఇసుకను సరఫరా చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేయటం సరికాదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిలదీశారు. మైనింగ్ అధికారులు లోతుగా విచారణ చేసి గబ్బాడలోని ఇసుక ప్రతిమా ఇన్‌ఫ్రాకి చెందిందని తేల్చారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపారని ఆ సంస్థకు రూ.18.7 కోట్ల జరిమానా విధిస్తూ సెప్టెంబర్ 12న నోటీసు ఇచ్చారు.

ఇంకెందుకు ఆలస్యం?

స్పీకర్ ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులు డంప్ చేసిన ఇసుక ఎవరిదో తేల్చారు. ఆ సంస్థకు జరిమానా విధించినప్పటికీ మైనింగ్, రెవెన్యూ అధికారులు గబ్బాడ డిపో నుంచి ఇసుక సరఫరాకు తీసుకున్న చర్యలు శూన్యం. ఎప్పుడు ఇసుక సరఫరా చేస్తారని నిర్మాణదారులు ఎదురు చూస్తున్నారు. డిపో ఎప్పుడు తెరుస్తారని ప్రజలు అడుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు నోరు మెదపటం లేదు. రెండు నెలలకు సరిపడా ఇసుక డిపో ఉన్నప్పటికీ సరఫరా కాక ఉపాధి లేక అవస్థలు పడుతున్నామని తాపీమేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు ఆవేదన చెందుతున్నారు. బొడ్డేరు, సర్పా నదులతో పాటు గెడ్డలు, వాగుల్లో అనధికారికంగా ఇసుకను సేకరించే అక్రమార్కులు ఇసుక రేట్‌ను పెంచేశారు. ట్రాక్టర్ ఇసుక రూ.8500, నాటు బండి రూ.1700 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిర్మాణదారులు వేరే గత్యంతరం లేక అక్రమార్కులు విధించిన రేటుకే ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ఇసుక కొరతను తీర్చేందుకు గబ్బాడ ఇసుక డిపోను తెరవాలని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి కబడ్డీ, వాలీబాల్ పోటీలు

పాయకరావుపేట: సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో జరిగే క్లస్టర్-7 బాలికల కబడ్డీ, వాలీబాల్ పోటీలు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో బుధ, గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నట్టు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ పోటీలు బాలికలకు అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో జరుగుతాయని, తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1200 మంది విద్యార్థినులు పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులకు వసతి, ఆటల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఏపీ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



నర్సీపట్నం: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సీపట్నంకు చెందిన ఎం.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ పరిశీలకుల ఆధ్వర్యంలో గత నెల 29న విజయవాడలో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. చెస్ క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

మూడు గంటలపాటు అప్పన్న దర్శనాలు బంద్



ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న దేవస్థానం ఉద్యోగి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ తిరుమంజన్ సేవ(ఆలయశుద్ధి) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామి దర్శనాలు బంద్ చేశారు. అనంతరం ఆలయ బేడా మండపం, ఆస్థానమండపం, ఆలయ ప్రాంగణాన్ని నీటితో శుభ్రం చేశారు. అలాగే స్వామివారి నిత్య, వార్షిక ఉత్సవాలకు అవసరమైన సామగ్రిని శుభ్రపరిచారు. అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి దర్శనాలను భక్తులకు కల్పించారు.

గురుకులంలో తల్లిదండ్రుల ఆందోళన



విద్యార్థుల తల్లిదండ్రులను శాంతింపజేస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్



గురుకుల ప్రిన్సిపాల్ ఆఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- సెలవులని సమాచారమిచ్చి విద్యార్థులను పంపకపోవడంపై ఆగ్రహం
- స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై మండిపాటు

దేవరాపల్లి: తెనుగుపూడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి సెలవులు కావున, పిల్లలను తీసుకెళ్లాలని సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులంతా మంగళవారం ఉదయమే పాఠశాలకు చేరుకున్నారు. అయితే బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించిన తరువాత పంపిస్తామని ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్ చెప్పడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం పాఠశాలకు చేరుకున్న తమను మధ్యాహ్నం వరకు గేటు తీసి, లోపలికి అనుమతించక పోగా.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తమతో పిల్లలను పంపించమని చెప్పడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. గాంధీ జయంతి ఉందని తెలిసినప్పుడు తమకు ఎందుకు ముందుగా సమాచారం ఇవ్వలేదని ప్రిన్సిపాల్ సహా ఇతర ఉపాధ్యాయులు, అధ్యాపకులపై మండిపడ్డారు. తుని, యలమంచిలి, పాడేరు తదితర సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలతో వచ్చిన తల్లిదండ్రులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులను పంపించేందుకు ససేమేర అనడంతో గత్యంతరం లేక నిరాశతో వెనుదిరిగారు. దీనిపై స్థానిక ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్‌ను వివరణ కోరగా.. ముందుగా రెండో తేదీ నుంచి సెలవులు కావడంతో ఒకటో తేదీ సాయంత్రం పిల్లలను పంపించేయ వచ్చునని డీసీవో నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఆ తర్వాత సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించాక పంపించాలని మరో సర్క్యులర్ జారీ చేశారన్నారు. దీంతో తల్లిదండ్రులకు ఈ సమాచారం పూర్తి స్థాయిలో చేరవేయకపోవడంతో ఈ సమస్య తలెత్తిందన్నారు.

టెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- అభ్యర్థుల సందేహాల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తుమ్మపాల: జిల్లాలో ఒకే పరీక్ష కేంద్రంలో ఈ నెల 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. టెట్ పరీక్ష ఏర్పాట్లపై మంగళవారం ఆమె కలెక్టరేట్‌లో వెబ్ఎక్స్ ద్వారా అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. 600 మంది అభ్యర్థులు హాజరయ్యే ఈ పరీక్షలు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, ఆ తర్వాత 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్లో నిర్వహిస్తామన్నారు. పరీక్ష కేంద్రానికి డిపార్టుమెంటల్ అధికారిగా పరవాడ ఎంఈవో సాయిశైలజని నియమించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమిస్తున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు, 144 సెక్షన్ విధించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆన్‌లైన్ పరీక్ష అయినందున నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సులను పరీక్ష కేంద్రానికి నడపాలని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల సందేహాల కోసం ఫోన్ నంబర్లు 9441238141, 9490462025, 9177042789 సంప్రదించాలన్నారు. పరీక్ష కేంద్రానికి ఎలాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకురావద్దని సూచించారు. అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 48 మంది విద్యార్థుల ఎంపిక



రగ్బీ ఆటల పోటీలో విద్యార్థులు

బుచ్చెయ్యపేట: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 48 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మండలంలోని దిబ్బిడి జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి రగ్బీ పోటీలు మంగళవారం నిర్వహించారు. పలు మండలాల నుంచి పాఠశాలలకు చెందిన 248 మంది బాల బాలికలు హాజరయ్యారు. వీరి మధ్య హోరాహోరీగా సాగిన పోటీల్లో అత్యంత ప్రతిభ చూపిన బాలబాలికలను అండర్ -14లో 24 మంది, అండర్ -17లో 24 మంది చొప్పున ఎంపిక చేశారు.

వీరంతా దసరా సెలవులు తర్వాత రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం సత్యారావు, పీఈటీ కిరణ్ తెలిపారు.

వరిలో తెగుళ్లు.. నివారణ చర్యలు

- పలు సూచనలు చేసిన ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితుల వల్ల వరిలో పొడ తెగులు ఆశించే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొడ తెగులు నివారణ చర్యలో భాగంగా సిఫార్సు మేరకు ఎరువులు వేసుకోవాలన్నారు. గట్ల మీద కలుపును నివారించి, తెగులు కనిపించినట్లయితే హెక్సాప్రోతయోలేన్ 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో ఆకు ముడత, కాండం తొలిచే పురుగు ఆశించవచ్చన్నారు. నివారణకు 2.5 మి.లీల క్లోరిఫైరిఫాస్ లేదా 0.3 మి.లీల క్లోరాంత్రనిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సుడిదోమ ఆశించినట్లయితే నివారణకు బుప్రోఫెజిన్ 1.6 మి.లీ. లేదా ఆసిఫేట్ 1.5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. దమ్ములో పొటాష్ వేయని వరి పొలాల్లో పొటాష్ లోపం కనిపించే అవకాశం ఉందన్నారు. నివారణకు ఎకరానికి 17 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. వరినాటిన 30 రోజులకు వెడల్పాటి ఆకు జాతి కలుపు నివారణకు 2, 4-డి సోడియం లవణాన్ని ఎకరానికి 400 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని, ఒక వేళ అన్ని రకాల కలుపు ఉన్నట్లయితే నివారణకు మెట్ సల్ఫ్యురాన్ మిథైల్ 10 శాతం, క్లోరి మ్యురాన్ ఇథైల్ 10 శాతం(ఆల్మిక్స్) మందును ఎకరానికి 8 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. చెరకులో పసుపు ఆకు తెగులును వ్యాప్తి చేసే పేనుబంక పురుగుల ఉధృతి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పెరిగే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, ఎం.విశాలాక్షి, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

ఖరీఫ్ వరికి ఈ-పంట, ఈకేవైసీ తప్పనిసరి

- రైతులకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సూచన
- ఈ-పంట, ఈకేవైసీ వివరాలపై క్షేత్రస్థాయి పరిశీలన



తవ్వవానిపాలెంలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

సబ్బవరం: రైతులు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన పంటలను పండించే దిశగా వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సూచించారు. మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో ఖరీఫ్ వరికి ఈ పంట నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన సర్వే నంబర్లలోని వరి క్షేత్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామంలోని డెక్కా సన్నిబాబు అనే రైతు పొలాన్ని పరిశీలించి ఈ-పంట నమోదుతో సరిపోల్చి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ-పంట నమోదు, ఈకేవైసీ కార్యక్రమాన్ని రైతులు విధిగా చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకుల పనితీరు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న ఎరువులు, విత్తనాల లభ్యతపై ఆరా తీశారు.

చిన్నయ్యపాలెంలో కూరగాయలు పండించే రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు, వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.రామారావు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, సర్పంచ్ బోకం స్వామినాయుడు, ఏఈవో బాలరాజు, వీఏఏ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా మండలంలోని అమృతపురం గ్రామంలో పింఛన్ల పంపిణీని కలెక్టర్ విజయక్రిష్ణన్ పరిశీలించారు. తొలిరోజే శత శాతం పింఛన్ల పంపిణీకి కృషి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, ఈవోపీఆర్డీ మహేష్, డీఆర్‌డీఏ పీడీ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

అనకాపల్లి: ఓ వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు.. మండలంలో దేవినగర్ ప్రాంతానికి చెందిన సౌజన్య నాలుగేళ్ల కుమార్తెతో సోమవారం ఇంటి నుంచి బజార్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త శివసాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ భీమరాజు



దౌడు తీస్తున్న గుర్రం

నాతవరం : గ్రామీణ ప్రాంతాల్లో అమ్మవారి పండగల సందర్భంగా క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయమని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అన్నారు. డి.యర్రవరం గ్రామంలో మంగళవారం నల్లగొండమ్మ తల్లి పండగ సందర్భంగా రాష్ట్ర స్థాయి గుర్రాల పరుగు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 15 గుర్రాలు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో కాకినాడ జిల్లా కోటనందూరు మండలం రాకీ గుర్రం, రెండో స్థానంలో విశాఖపట్నం జిల్లా తగరపువలస మండలం మణి గుర్రం, మూడో స్థానంలో కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గుర్రాల శ్రీనుకు చెందిన గుర్రం నిలిచాయి. నైపుణ్యం కనబరిచిన గుర్రాల యాజమానులకు ఉత్సవ కమిటీ సభ్యులు అందించిన ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. మొదట బహుమతిగా రూ.15 వేలు నగదు, షీల్డు, రెండవ బహుమతి రూ.12వేలు నగదు, షీల్డు, మూడో బహుమతి రూ.10వేలు నగదు, షీల్డు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న గుర్రాలకు రవాణా ఖర్చులు, అమ్మవారి షీల్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నల్లగొండమ్మ తల్లి ఆలయ నిర్మాణకర్త బెన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో డీన్ల నియామకం



ఏయూ రిజిస్ట్రార్ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య సీహెచ్ శ్రీనివాసరావు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీలో పలువురిని డీన్లుగా నియమిస్తూ వీసీ ఆచార్య శశిభూషణ్‌రావు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం డీన్‌గా సీహెచ్ శ్రీనివాసరావు, గెస్ట్ హౌస్‌లకు ఇన్‌చార్జి డీన్‌గా లైబ్రరీ సైన్స్ ఆచార్యుడు డాక్టర్ వి.ధనరాజ్, సీడీసీ అసోసియేట్ డీన్‌గా ఆచార్య ఎ.రామనాగ హనుమాన్, నార్త్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా డాక్టర్ చల్ల నరసింహం, కాన్ఫిడెన్షియల్ విభాగం అసోసియేట్ డీన్‌గా ఆచార్య పి.వెంకటేశ్వరరావు, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీవోఈ) అసోసియేట్ డైరెక్టర్లుగా డాక్టర్.వి.సిద్ధయ్య, సి.హెచ్.శ్రీనివాసరావులను నియమించారు. వీరికి రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ నియామక ఉత్తర్వులు అందించారు.

గణేష్ నిమజ్జనంలో విషాదం

- విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి



పోలవరపు శ్యామ్ మృతదేహం

మునగపాక: మునగపాకలో సోమవారం రాత్రి జరిగిన గణేష్ నిమజ్జనంలో విషాదం నెలకొంది. విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం రావాడ పంచాయతీ ధర్మారాయుడుపేటకు చెందిన పోలవరపు పైడికొండ కుమారుడు శ్యామ్(22) పరవాడలోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఖాళీగా ఉన్న సమయంలో డీజే నిర్వాహకులతో పని చేస్తుంటాడు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి మునగపాకలో వినాయక నిమజ్జనానికి బంధువులకు చెందిన డీజేను తీసుకువచ్చాడు. వినాయక ఊరేగింపులో భాగంగా కొంత సేపటి తరువాత విద్యుత్ షాక్‌కు గురై శ్యామ్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతనిని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడనుకున్న కుమారుడు అర్ధంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. శ్యామ్ తండ్రి పైడికొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

4 ఇసుక లారీల పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీలు

నక్కపల్లి: ఎటువంటి అనుమతులు లేకుండా రాజమండ్రి నుంచి అచ్యుతాపురానికి ఇసుక తరలిస్తున్న 4 లారీలను మంగళవారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి పరిసరాల నుంచి అచ్యుతాపురం ప్రాంతానికి ఎటువంటి అనుమతులు లేకుండా లారీల్లో ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు వేంపాడు టోల్ ప్లాజా వద్ద సిబ్బందితో సీఐ నిఘా పెట్టారు. నాలుగు లారీల్లో తరలిస్తున్న ఇసుకను పట్టుకుని, కేసు నమోదు చేశారు. లారీల యజమానులకు జరిమానా విధించామని సీఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



తుమ్మపాల: సత్యనారాయణపురం రైల్వే అండర్ పాస్‌కి సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని మృతి చెందారు. మృతుడి వయసు 35-40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎత్తు సుమారు 5.7 అడుగులు, చామనఛాయ రంగు కలిగి ఉన్నాడని తువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారామ్ తెలిపారు. వైట్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, బ్రౌన్ కలర్ కట్ బనియన్ ధరించాడన్నారు. మృతుని ప్యాంట్ చిరిగిపోయిందని, కుడి చేతికి పూసలతో కుడిన కాషాయం రంగు తాడు ఉందన్నారు. కుడి చేతి వేలుకి రాగి ఉంగరం(పచ్చపొడి), రాగి ఉంగరం(పసుపు పొడి) ఉన్నాయన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఫోన్ నంబర్ 76739 06010లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

గుండె పోటుతో వార్డెన్ మృతి



వార్డెన్ శ్రీనివాసరావు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి ఎస్సీ బాలుర వసతి గృహ వార్డెన్ చొప్పా శ్రీనివాసరావు(52) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. అనకాపల్లిలో నివాసం ఉంటున్న ఆయనకు తెల్లవారు జామునే ఇంటి వద్ద ఉండగా గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాసరావు మృతి పట్ల స్నేహితులు, పలు వసతి గృహాల సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు స్వగ్రామం సారిపల్లి పాలెం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పోలీసులపై దాడి కేసులో నలుగురి అరెస్ట్

బీచ్‌రోడ్డు: పోలీసులపై దాడి చేసి ఘటనలో నలుగురు బీచ్ వ్యాపారులు అరెస్ట్ అయ్యారు. అల్లూరు జిల్లాకు చెందిన కానిస్టేబుల్, నగరానికి చెందిన ఇద్దరు హోంగార్డ్‌లపై ఆదివారం అర్ధరాత్రి బీచ్ వ్యాపారాలు దాడి చేసి తీ వ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై గాయపడిన పోలీసులిచ్చిన ఫిర్యాదుతో మూడో పట్టణ పోలీసులు దర్యాప్తు చేశారు. నలుగురు వ్యాపారులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సింహాద్రి ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడి మృతి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో సీహెచ్‌పీ-1లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు పడాల నాగేశ్వరరావు (55) మంగళవారం ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందాడు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. కలపాక శివారు స్వయంభూవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు సీహెచ్‌సీ-1లో హౌస్‌కీపర్‌గా పనిచేస్తున్నాడు. నాగేశ్వరరావు మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడి గుండెకు సంబంధించిన వ్యాధితో కిందపడిపోయాడు. అక్కడే ఉన్న సూపర్‌వైజర్ రామకృష్ణ, తోటి కార్మికులు సీపీఆర్ చేసి దీపాంజలి నగర్‌లో ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నాగేశ్వరరావును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు కుమారుడు పడాల లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

ప్రతి మహిళా చిరు వ్యాపారవేత్తగా ఎదగాలి

- దేవరాపల్లిలో చిరుధాన్యాల యూనిట్‌ను పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ శచీదేవి



చిరుధాన్యాల యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

దేవరాపల్లి: ప్రతి మహిళా చిరు వ్యాపార వేత్తగా ఎదిగేలా తోడ్పాటునందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె. శచీదేవి తెలిపారు. మండలంలోని దేవరాపల్లి, తెనుగుపూడి, మారేపల్లి గ్రామాల్లో మంగళవారం ఆమె పింఛన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం దేవరాపల్లిలో ఒన్ నేషన్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)లో గుర్తించిన ఎస్‌హెచ్‌జీ సభ్యుల చిరుధాన్యాల యూనిట్‌ను ఆమె పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం వెలుగు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఓఎన్‌డీసీ విధానాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు చేస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలు తయారీ చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి వ్యాపార రంగంలో అడుగు పెట్టిస్తామన్నారు. ప్రతీ మండలం నుంచి మహిళలు తయారీ చేసిన కనీసం 10 ఉత్పత్తులను బహిరంగ మార్కెట్లో విక్రయించేలా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. జిల్లాలో 40 వేలు డ్వాక్రా సంఘాల్లో 4 లక్షల 16 వేల మంది మహిళలు ఉన్నారన్నారు. స్త్రీనిధి ద్వారా ఇప్పటి వరకు 1,91,600 మందికి రూ.98.2 కోట్లు రుణాలివ్వగా, 98.4 శాతం రికవరీ చేశామన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేటింగ్ ప్రోగ్రాం ద్వారా రుణాలు సైతం అందజేస్తామని స్పష్టం చేశారు. వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్, సీసీలు, సీఏలు పాల్గొన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి



ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నేతలు

అనకాపల్లి: సైద్ధాంతిక విలువలకు కట్టుబడుతూనే, ఇతర రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు కొనసాగించిన గొప్ప మానవతావాది సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ స్థానిక విజయ రెసిడెన్సీలో మంగళవారం జరిగింది. సీతారాం చిత్ర పటానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, సీపీఎం నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ ఏచూరి ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలన్నారు. యూపీఏ ప్రభుత్వంలో అనేక ప్రజానుకూల చట్టాలు రావడం వెనక సీతారాం కృషి ఉందన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రపతి ప్రసంగానికి ఆమోదం తెలిపే ప్రసంగంలో సవరణలు చేసి ఆమోదింపజేసి పార్లమెంట్ చరిత్రలో నిలిచారని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణకు చట్టసభలోనూ, బయట నిరంతరం ఏచూరి పోరాటం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖలో సీతారాం విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్, ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పి.ఎస్. అజయ్‌కుమార్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుల నిరసన



సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కశింకోట: స్థానిక సంతబయల భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక సరఫరా చేయాలని, భవన నిర్మాణానికి కావలసిన సిమెంట్, ఇనుము సామగ్రి ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులకు అందించాల్సిన సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు బి.మహేష్, జి.అప్పలకొండ, డి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సన్ని యూత్ క్లబ్

కశింకోట: మండలంలోని బయ్యవరంలో సన్ని యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు అగ్గాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి ప్రసాద్, సమన్వయకర్త కొరుప్రోలు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగసత్యనారాయణ, హైస్కూలు విద్యా కమిటీ చైర్మన్ ఆరిపాక వీరబ్రహ్మం, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సన్నెడ గజ్జాలు, ఉపాధ్యాయుడు వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ జయంతి


వేడుక నిర్వహిస్తున్న చిన్నారులు

అనకాపల్లి: స్థానిక వుడ్ పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహాత్మునిగా ప్రపంచ ప్రజలచే కీర్తించబడిన గాంధీ జీవన ప్రయాణం, అహింస, శాంతి ఆయుధాలుగా బ్రిటిష్ దాస్య శృంఖలాల నుంచి దేశ స్వాతంత్య్రాన్ని సాధించిన చారిత్రక ఘట్టాలను, చిట్టి పొట్టి చిన్నారులకు స్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్ కుమార్ వివరించారు. గాంధీ స్వయంగా ఆచరించి మనకు నేర్పిన సరళత విలువలు, సత్యం, అహింస మొదలగునవి విద్యార్థులకు చిన్నతనం నుంచే నేర్పుట ద్వారా ప్రతి వ్యక్తి మహాత్మునిగా ఎదగగలరని అభిలషించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ తహసీల్దార్‌గా అంబేడ్కర్

పరవాడ: స్థానిక తహసీల్దార్‌గా ఎస్వీ అంబేద్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నక్కపల్లి మండలం తహసీల్దారుగా పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–18 యూనిట్లు, ఓ పాజిటివ్–4 యూనిట్లు, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 456 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 359 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

శరన్నవరాత్రులకు ఏర్పాట్లు

రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం • ముస్తాబవుతున్న ఆలయాలు • పురవీధుల్లో సిద్ధమవుతున్న పందిళ్లు


గవరపాలెం సతకంపట్టు వద్ద కనకదుర్గమ్మ

వినాయక చవితి ఉత్సవాలు ముగిశాయి. రేపటి నుంచి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రుల సందడి మొదలు కానుంది. ఇందుకోసం ఊరూవాడా సిద్ధమవుతోంది. అమ్మలగన్నయమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. అంటూ కనకదుర్గమ్మను తొమ్మిది రోజుల పాటు పూజించేందుకు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. అమ్మవారి ప్రతిమలను నెలకొల్పేందుకు ఉత్సవ కమిటీలు సైతం ప్రత్యేక మండపాలు సిద్ధం చేస్తున్నాయి.

తుమ్మపాల: దేవీ నవరాత్రులు వస్తున్నాయంటే.. ప్రతి పల్లెలోను నెలవైన కనకదుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. అమ్మవారి ప్రతిమలను ప్రతి చోట ఏర్పాటు చేసి భక్తులు దేవీమాలలు ధరించి తొమ్మిది రోజులు ప్రత్యేక నిష్ఠతో పూజలు చేయనున్నారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే నవరాత్రులు ఈ నెల 12వ తేదీ విజయదశమి వేడుకలతో ముగియనున్నాయి. పట్టణంతో పాటు మండలంలో కనకదుర్గమ్మ ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోజుకొక అలంకారంలో దర్శనం...

దుర్గమ్మను తొమ్మిది రోజుల పాటు ఆయా రూపాల్లో అలంకరించి నిత్య పూజలు చేయనున్నారు. ఇందులో భాగంగా మొదటిరోజు బాల త్రిపుర సుందరీ, రెండో రోజు గాయత్రీ దేవి, మూడో రోజు అన్నపూర్ణా దేవి, నాల్గో రోజు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి, ఐదో రోజు శ్రీ మహా చండీ దేవి, ఆరో రోజు శ్రీ మహాలక్ష్మి దేవి, ఏడో రోజు శ్రీ సరస్వతీ దేవి (మూలా నక్షత్రం), ఎనిమిదో రోజు శ్రీ దుర్గాదేవి(దుర్గాష్టమి), తొమ్మిదో రోజు మహిషాసుర మర్దినీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.


సత్యనారాయణపురం కనకదుర్గమ్మ


తుమ్మపాల విద్యుత్‌నగర్‌లో అమ్మవారిని నెలకొల్పేందుకు ఏర్పాటు చేస్తున్న పందిరి

• సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో...

మండలంలో సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో దేవి నవరాత్రులకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. శ్రీదుర్గా రామలింగేశ్వర టెంపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని ఆయా రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు చేస్తారు. నిత్యం గోత్ర నామాలతో పంచామృతాభిషేకం సహస్ర నామార్చన కార్యక్రమాలు జరుగుతాయి. 3వ తేదీన తెల్లవారు జామున అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అలంకరణ సహస్ర కుంకుమార్చన, లక్ష్మిగణపతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా చేపట్టి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొండపై దేవాలయం మాడవీధుల్లో ఊరేగించి ఉత్సవ ప్రారంభ కలశ స్థాపన కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం చేయనున్నారు.

• రాష్ట్ర స్థాయి నాటిక ప్రదర్శనకు ఏర్పాట్లు..

పట్టణంలోని గవరపాలెంలో సతకంపట్టు జంక్షన్ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో చైర్మన్, వ్యవస్థాపకులు కాండ్రేగుల నాయుడు, పీవీ రమణల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల ఉత్సవాలకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి రోజూ 1500 మంది భవానీ భక్తులకు నిత్యాన్నదానం, 3, 4, 5, 6, 7 తేదీల్లో రాష్ట్ర స్థాయి నాటిక ప్రదర్శనల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8న వేల మంది ముత్తయిదువులు తాంబూలాల కార్యక్రమం, 9న సరస్వతి దేవి అవతారం, పట్టణ పరిసరాలలో అనాథ ఆశ్రమాల పిల్లలకు ఆరు నుంచి ఏడాది కాలానికి సరిపడా నిత్యావసర సరకుల పంపిణీ చేయనున్నారు. విజయదశమి రోజున అమ్మవారి 11 అవతారాలతో పట్టణ పురవీధుల్లో భారీగా ఊరేగింపు చేపట్టనున్నారు. విద్యుత్ అలంకరణ, మందుగుండు, ఇతర రాష్ట్రాల నుంచి నృత్యకారులచే సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


దేవీ నవరాత్రులకు రంగులతో అలంకరించిన ఆలయం

అనకాపల్లి మండలంలో..

తుమ్మపాల, కొత్తూరు, మార్టూరు, మామిడిపాలెం, రేబాక, గొలగాం, కోడూరు, కుంచంగి, కూండ్రం పలు గ్రామాల్లో కనకదుర్గమ్మ పందిర్లు వేసి అమ్మవారిని 3వ తేదీన ఊరేగింపుగా తీసుకువచ్చి పందిర్లలో నెలకొల్పుతారు. భక్తులు భవానీ మాలలు ధరించి నవరాత్రుల్లో పూజలు చేస్తారు. నిత్య పూజలు, హోమాలతో రోజూ ఆలయాల వద్ద సందడి చేస్తారు. మొక్కులు తీర్చుకునేందుకు ఇళ్ల వద్ద అమ్మవారిని నెలకొల్పి భవానీ భక్తులతో అంబలం పూజలు, భజనలు చేస్తారు. ఒక్కో గ్రామంలో కనీసం 300 మంది గ్రామస్తులు తొమ్మిది రోజుల పాటు భవానీమాలలు ధరించి అమ్మవారి పూజలు నిష్ఠతో నిర్వహిస్తారు. ఆయా గ్రామాల్లో ఆలయాలకు నిత్యభక్తులు వచ్చి పూజలు చేస్తారు.

విద్యార్థులకు చెకుముకి సైన్స్ పోటీలు


సైన్స్ పోటీలు నిర్వహిస్తున్న జేవీవీ ప్రతినిధులు

అనకాపల్లి: జన విజ్ఞాన వేదిక అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక దొడ్డి రామనాయుడు భవనంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించినట్లు వేదిక పట్టణ కన్వీనర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో పట్టణంలోని 11 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 54 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. మండల స్థాయి పరీక్షలలో ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి వాసవి బాలవిహార్ స్కూల్ ప్రథమ, ద్వితీయ, ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి జీఎంసీ పెద్ద హైస్కూల్, గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్ మొదటి, రెండు స్థానాల్లోనూ నిలిచాయన్నారు. ఇవి జిల్లా స్థాయి పరీక్షలకు అర్హత సాధించాయన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ఎం.నాగేశ్వరరావు, కె.నూకేశ్వరరావు, వి.ఉమాదేవి, డి.సునీతాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి అండర్–19 వాలీబాల్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళీధర్ తెలిపారు. ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు పి.ప్రశాంతి, ఎ.ఆనంద్, డి.మాతాజీ జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరిని జిల్లా వృత్తి విద్యా పర్యవేక్షణ అధికారి పి.మురళీధర్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి, కళాశాల సిబ్బంది అభినందించారు.

చంద్రబాబు తక్షణమే రాజీనామా చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్



అనకాపల్లి: కలియుగ దైవం తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందని కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసిన చంద్రబాబునాయుడుకు సుప్రీం కోర్టు మొట్టికాయ వేయడం చెంపపెట్టు అని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ బేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వంద రోజుల పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజల దృష్టిని మరల్చడానికి ఇటువంటి కుట్రలకు తెరతీశారని దుయ్యబట్టారు. రాజకీయం చేయాలంటే తనతో చేయాలని, తిరుమల లడ్డూను అడ్డుపెట్టుకుని చేయడం దుర్మార్గపు చర్య అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మొదటి నుంచి విమర్శిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలను చంద్రబాబునాయుడు దెబ్బతీశారన్నారు. లడ్డూ విషయంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సిట్‌తో కాకుండా సీబీఐగానీ, సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితోగానీ విచారణ చేయించాలని కోరారు.

వరద బాధితులకు విద్యార్థుల విరాళాలు


హెచ్‌ఎం విజయలక్ష్మి సుమన్‌కు డీడీ అందజేస్తున్న విద్యార్థులు

కశింకోట: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం విద్యార్థులు రూ.22,330 విరాళాలు సేకరించారు. తాళ్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు తమ గ్రామంలో స్వచ్ఛందంగా ఇంటింటికి వెళ్లి విజయవాడలో వరద వల్ల జరిగిన నష్టాన్ని వివరించి విరాళాలను వసూలు చేశారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి జమయ్యేలా డీడీ తీసి మంగళవారం హెచ్‌ఎం వై.విజయలక్ష్మిసుమన్‌కు అందజేశారు. సర్పంచ్ రెల్లి నాగయమ్మ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కరణం శ్రీనివాసరావు, కూటమి ప్రతినిధులు, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

హోంగార్డు కుమారుడికి కారుణ్య నియామకం


హోంగార్డు కుమారుడికి కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: హోంగార్డు కుమారుడు పైల అప్పలనాయుడు కుమారుడు శ్రీనివాసుకు కారుణ్య నియామక పత్రాన్ని ఎస్పీ ఎం.దీపిక మంగళవారం తన కార్యాలయంలో అందజేశారు. స్టీల్ ప్లాంట్‌లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు అప్పలనాయుడు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మూడు మాసాల్లో మృతుడు కుమారుడికి నియామక పత్రం అందజేశామని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖలో అంకిత భావంతో విధులు నిర్వహించిన ప్రతి వ్యక్తికీ గుర్తింపు ఉంటుందన్నారు. ఉద్యోగంలో చేరే మొదటిరోజు ఎంతటి ఉత్సాహంతో విధులకు హాజరవుతారో.. అదే ఒరవడి చివరి వరకు కొనసాగాలన్నారు. మొదటిరోజు నుంచి ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

వృద్ధుల ఆరోగ్యం, సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ


తాళ్లపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కశింకోట: వృద్ధుల ఆరోగ్యం, సంరక్షణ పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారి యు. రమేష్ కోరారు. మంగళవారం తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ జీవిత చరమాంకంలో వృద్ధులు ఆనందంగా గడిపేలా ఆప్యాయంగా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వృద్ధులకు ఆరోగ్య సేవలు, ఉచిత కంటి శస్త్ర చికిత్సలు అందిస్తున్నారని, వాటిని వినియోగించుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎ.వి. సుబ్బారావు, హెల్త్ సూపర్‌వైజర్ కె.ఎస్.ఆర్.కె. నరసింహారావు, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలి


విద్యార్థులకు బుక్స్, పెన్సిల్స్ అందజేస్తున్న ఆడారి కుమారస్వామి

అనకాపల్లి: బలహీన వర్గాల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలని పబ్లిక్ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ సమన్వయకర్త ఆడారి కుమార్‌స్వామి తెలిపారు. మంగళవారం స్థానిక విజయరామరాజుపేట ఎలిమెంటరీ పాఠశాలలో మంగళపల్లి వెంకట వీరభద్ర సుబ్రహ్మణ్యం దంపతులు రూ.10 వేలతో సమకూర్చిన మ్యాట్స్, నోటు బుక్స్, వాటర్ బాటిల్స్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఏటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు బోధన చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విజయరామరాజుపేట గ్రామ కమిటీ ప్రతినిధులు ఆళ్ల శివరాం, సత్యనారాయణ, పలకా రాము, బొబ్బిలి అప్పారావు, త్రినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

098 శాతం పింఛన్ల పంపిణీ


పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు


లబ్ధిదారు శేషుకు పింఛన్ అందజేస్తున్న ఏఎన్‌ఎం స్వప్న

కశింకోట: మండలంలో 98 శాతం మేర సామాజిక పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో వి.వి. రవి కుమార్ మంగళవారం తెలిపారు. మొత్తం 10,384 పింఛన్లకుగాను 10,166 మందికి సచివాలయ, పంచాయతీ సిబ్బంది పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. ఇళ్ల వద్ద లేకపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్లడం తదితర కారణాల వల్ల పంపిణీ కాని మిగిలిన పింఛన్లను బుధవారం అందజేస్తామన్నారు.

పింఛన్ల కోసం ఎదురుచూపు

అనకాపల్లి: వేటజంగాలపాలెంలో వృద్ధులు పింఛన్ కోసం మంగళవారం ఉదయం 7 గంటలకే పడిగాపు కాశారు. కూటమి ప్రభుత్వం వేకువజాము ముందే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పి ఇప్పుడు ఒకే స్థలంలో కూర్చోమని చెప్పడంతో పదిమంది వృద్ధులు పింఛన్ల కోసం ఎదురు చూశారు. 7 గంటల తర్వాత సచివాలయం ఉద్యోగి వచ్చిన అందరికీ ఒకే చోట అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

అనకాపల్లి పట్టణంలోని వేల్పులవీధికి చెందిన శేషు మూడు రోజులుగా స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో అనారోగ్య కారణంగా చికిత్స పొందుతున్నాడు. అక్కడకు సచివాలయం ఏఎన్‌ఎం స్వప్న వెళ్లి అతడికి రూ.4 వేలు వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

తుమ్మపాల: పట్టణంలో కామాక్షి దేవి దసరా నవరాత్రి మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను తెలిపారు. ఇక్కడ అమ్మవారి ఆలయ మండపంలో నవరాత్రి మహోత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆయనతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 9, 10, 11 తేదీల్లో రైతు భారతీ మేడ పైన సురభి నాటకాలు ప్రదర్శిస్తామన్నారు. ఆలయం వద్ద ఎస్. భారతి భాగవతారిణి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర హరికథా కాలక్షేపవు, 10న అమ్మవారి మూల విరాట్‌కు యాలకులు, లవంగాలతో ప్రత్యేక అలంకరణ, 14న భారీ అన్న సమారాధన, అమ్మవారి అనుపు మహోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు కొంత్యాణ సతీష్, కోశాధికారి ధవలేశ్వరం లక్ష్మణరావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజీ బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ నరసింహాచారి, ఉత్సవ కమిటీ కన్వీనర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలదే ఉన్నత స్థాయి


విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం రుధిర రాణి

అనకాపల్లి: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాల్లో ఉన్నారని, దేశ రక్షణ రంగాల్లో వారి పాత్ర కీలకమైందని హెచ్‌ఎం ఓ.రుధిర రాణి తెలిపారు. జీవీఎంసీ వేల్పులవీధి టౌన్ గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో వీర్‌ఘర్ 4.0 పేరిట మాజీ సైనిక ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కార్గిల్ యుద్ధంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మాజీ సైనిక ఉద్యోగి బలిరెడ్డి ప్రకాశరావు మాట్లాడుతూ తన సర్వీస్‌లో కార్గిల్ యుద్ధంలో జరిగిన సంఘటలను, టెర్రరిస్టులతో పోరాడిన సన్నివేశాలను విద్యార్థులకు వివరించారు. నాలుగేళ్లుగా ప్రతి కుటుంబం నుంచి దేశం కోసం సైన్యంలో చేరాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు ఎం.జయచంద్ర, ఉపాధ్యాయులు ఓ.రమాదేవి, రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణ ఉద్యోగుల నిరసన


స్థానిక శేఖర్ బ్యాంక్ ఎదురుగా మద్యం దుకాణం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి: కూటమి వంద రోజుల పాలనలో ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వకుండా, ఉన్న వారిని తొలగించి నిరుద్యోగ సమస్య పెంచుతుందని అనకాపల్లి మద్యం దుకాణాల అసోసియేషన్ ప్రతినిధి అరవింద్ తెలిపారు. మంగళవారం స్థానిక శేఖర్‌రావు పెట్రోల్ బంక్ ఎదురుగా మద్యం దుకాణం వద్ద ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కోసం 11 రోజులు విధులు నిర్వహించాలని జీవో ఇచ్చారని, ఆ తర్వాత తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గత నెల 27న అనకాపల్లి ఐ.ఎం.ఎఫ్.ఎల్ డిపో డీఎంకు వినతిపత్రం అందజేశామన్నారు. నేటి వరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకుండా పోయిందని వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మంది కార్మికులు మద్యం షాపుల్లో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్కసారిగా విధులు నుంచి తొలగించినట్లయితే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు నాయుడు, శ్రీను, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం

పరవాడ: ఎన్టీపీసీ దీపాంజలినగర్ జీవన్‌రేఖా ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఓ అండ్ ఎం జీఎం ఎస్.జె.డేవిడ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం వలన ఆపదలో ఉన్న వారిని కాపాడవచ్చన్నారు. గాజువాక వందే భారత్ బ్లడ్ సెంటర్, ఎన్‌జీవో సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 35 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కె.విజయ(సీఎంవో సింహాద్రి), అసోసియేషన్ ప్రతినిధులు, రక్తదాతలు, సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న దాతలు